క్లుప్తంగా

తెలుగు భాష సేవా పురస్కారం



బెన్నమ్మను సన్మానిస్తున్న కళావేదిక ప్రతినిధులు

కర్నూలు(అర్బన్): తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్న నగరంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల నంబర్– 1 వసతి గృహం సంక్షేమాధికారిణి బైరపోగు బెన్నమ్మ తెలుగు తేజం – తెలుగు భాష సేవా పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాష దినోత్సవాల సంబరాల సందర్భంగా నరసరావుపేటలో గత నెల 31న శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ తదితరులు బెన్నమ్మను ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందించారు.

అయోడిన్ లోపిస్తే థైరాయిడ్

కర్నూలు(హాస్పిటల్): శరీరంలో అయోడిన్ లోపిస్తే థైరాయిడ్ వ్యాధి వస్తుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముషాహిద్ చౌదరి చెప్పారు. నగరంలోని బండిమెట్ట యూపీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోడిన్ ఉప్పు త్వరగా ఆవిరయ్యే లక్షణం ఉంటుందని, ఎండ వేడిమి లేదా గాలి తగలకుండా మూత ఉన్న డబ్బాలలో నిల్వ చేయాలన్నారు. మనుషుల శారీరక పెరుగుదల, మానసిక వృద్ధి, పిల్లల్లో తెలివికి అయోడిన్ ఎంతో ముఖ్యమన్నారు. గర్భవతులు తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపిస్తే శిశువు లోపాలతో జన్మిస్తారన్నారు. అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలని సూచించారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. అయోడిన్ లోపం వల్ల వచ్చే రుగ్మతల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రత్యేక కిట్‌ల ద్వారా ఉప్పులో అయోడిన్ శాతాన్ని పరీక్షించి విద్యార్థులకు చూపించారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పేస్ ఆన్ వీల్స్ ప్రదర్శన



బస్సులో ఏర్పాటు చేసిన ప్రదర్శనను వీక్షించిన విద్యార్థులు

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇస్రో స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా బస్సులో ఏర్పాటు చేసిన ప్రదర్శనను విద్యార్థులు వీక్షించారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ పి.చంద్రశేఖర్ ప్రదర్శనను ప్రారంభించి ప్రసంగించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం సాధించిన విజయాలతో విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు. విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అంతరిక్ష పరిశోధనల గురించి విద్యార్థులకు వివరించారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఎం.శారద, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా ఎం.పద్మావతి వ్యవహరించారు. ప్రదర్శనను క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ, సెయింట్ జోసెఫ్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ విద్యార్థులు వీక్షించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



విద్యార్థులతో కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు, అధ్యాపకులు

కర్నూలు(హాస్పిటల్): నిత్యం పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటి మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ చెప్పారు. జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నగర శివారు పెద్దపాడులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కౌమార దశలో ఉన్న బాలికలు పోషకాహారం తీసుకోవాలని, ఐరన్ లోపం రాకుండా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు, చేతుల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత, రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోస్టర్ల ద్వారా ఇంటర్నీస్ మెడికల్ విద్యార్థులు వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం హరిత, వైద్యాధికారులు ప్రవీణ, వెంకటేశ్వర్లు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో శుభ్రతకు పెద్దపీట

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ప్రాంగణంలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్లు వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వెంకట బసవరావు పేర్కొన్నారు. వర్సిటీలో చేపట్టే పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలకు ఉపకరించే వివిధ యంత్ర సాధనాలు, పనిముట్లను కొనుగోలు చేసిన వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగాన్ని ఆయన అభినందించారు. వీసీ మాట్లాడుతూ.. వలంటీర్లతో సమన్వయం చేసుకుంటూ మరిన్ని కార్యక్రమాలకు రూపకల్పన చేయాల్సిందిగా సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి పకడ్బందీ కార్యాచరణ

- 3 కి.మీ పొడవున శోభాయాత్ర
- బందోబస్తు విధులకు రెండు వేల మంది పోలీసు సిబ్బంది
- డ్రోన్, వీడియో, సీసీ కెమెరాలతో చిత్రీకరణ
- సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా

కర్నూలు: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని కర్నూలులో వాడవాడలా ప్రతిష్టించిన విగ్రహాలు భక్తుల నుంచి విశేష పూజలందుకుంటున్నాయి. మరోవైపు నిమజ్జనానికి గడువు సమీపించడంతో విగ్రహాల మహా నిమజ్జన ఘట్టం విజయవంతంగా పూర్తి చేసేందుకు పోలీసు యంత్రాంగం రూట్ మ్యాప్‌తో సిద్ధమయ్యింది. వేడుకలను తిలకించేందుకు భారీగా జనం వచ్చే అవకాశముండటంతో పోలీసులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు. సుమారు రెండు వేల మంది పోలీసులను బందోబస్తు విధులకు కేటాయించారు. ట్రాఫిక్ నిబంధనలు, రూట్ మ్యాప్‌ను విగ్రహాల నిర్వాహకులకు స్టేషన్ల వారీగా సూచించారు. ఈనెల 4న నిమజ్జనం జరగనుంది. ఈ నేపథ్యంలో విగ్రహాలు తరలివెళ్లే మార్గాల్లో వాహనాలను అనుమతించరు. బందోబస్తు విధులకు నియమించిన సిబ్బందితో ఉన్నతాధికారులు సమన్వయ సమావేశం కూడా నిర్వహించారు.

డ్రోన్, నిఘా నేత్రాల సహకారంతో...

డ్రోన్, నిఘా నేత్రాల సహకారంతో శోభాయాత్ర కార్యక్రమాలపై డేగ కన్ను వేసి పర్యవేక్షించనున్నారు. జిల్లా పోలీసు కార్యాలయం కంట్రోల్ రూమ్ నుంచి ఉత్సవాలపై నిఘా ఉంచనున్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా పసిగట్టవచ్చు. ఎక్కడైనా చిన్నపాటి గొడవ జరిగినా పోలీసు సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దేలా కార్యాచరణ సిద్ధం చేశారు. శోభాయాత్రకు ఆటంకాలు లేకుండా సాఫీగా సాగేందుకు పోలీసు, మున్సిపల్ శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లే క్రమంలో గతంలో ప్రమాదాలు జరిగాయి. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు దృష్టి సారించారు. మహిళలు, యువకులు, చిన్నారులు ఈ వేడుకలో ఎక్కువగా పాల్గొంటున్నందున ప్రత్యేక భద్రత ఏర్పాట్లపై పోలీసు అధికారులు దృష్టి సారించారు. నగరం నలువైపుల నుంచి ప్రధాన రోడ్ల గుండా ఊరేగింపు సాగనుంది.

గత ఉత్సవాల్లో అల్లర్లు సృష్టించిన వారితో పాటు పాత రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. నిమజ్జనం మరుసటి రోజే మిలాద్–ఉన్–నబీ ఉన్నందున శోభాయాత్ర సాగే ప్రాంతాల్లో ప్రార్థన మందిరాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసేవారిని గుర్తించేందుకు నిఘా ఉంచారు. ఏదైనా సమస్య తలెత్తితే సమీప పోలీస్‌స్టేషన్ లేదా 100, 112కు సమాచారం అందించాలని పోలీసు శాఖ సూచిస్తోంది. నిమజ్జనం పూర్తయిన తర్వాత వాహనాలు దేవనగర్, క్రిష్ణానగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళ్లేలా రూట్ మ్యాప్ రూపొందించారు.



వినాయక్ ఘాట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

● నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

కర్నూలు కల్చరల్: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష సూచించారు. ఈనెల 4న కర్నూలులో జరిగే వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఆయన మంగళవారం వినాయక ఘాట్‌ను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. నిమజ్జన ఘాట్‌లో లైట్లు, తాగు నీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు. బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను, మత్స్య శాఖకు సంబంధించి గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి



వినాయక నిమజ్జనంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. శోభాయాత్ర, నిమజ్జనంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఉత్సవ కమిటీలకు పోలీసులు తెలియజేశారు. ఘర్షణలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలి. ముఖ్యంగా డీజేల వినియోగం, బాణాసంచా కాల్చడం చేయరాదు. అనుమానిత వస్తువులు కానీ, వ్యక్తులు కాని తారసపడితే పోలీసులకు సమాచారమివ్వాలి.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ

4న ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు: గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని సెప్టెంబర్ 4న ఉదయం 10 గంటల నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు కర్నూలు నగరంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. అత్యవసర సర్వీసులు 108, ఫైర్, అంబులెన్స్‌లు, పోలీసు వాహనాలు, పోలీసు అనుమతి పొందిన వాహనాలకు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతి ఉంటుంది. కర్నూలు కొత్తబస్టాండ్ నుంచి రాజ్‌విహార్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక ఘాట్, గాయత్రి ఎస్టేట్ వరకు వాహనాల రాకపోకలపై నిషేధం ఉంటుంది. నంద్యాల చెక్‌పోస్టు వైపు వాహనాలు, బస్సులు బస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంకు, బిర్లా జంక్షన్, మద్దూర్ నగర్ సర్కిల్, సి.క్యాంప్ మీదుగా వెళ్లాల్సిఉంటుంది. అలాగే ఆత్మకూరు, నంద్యాల వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు సి.క్యాంప్, బిర్లాగేట్, గుత్తి పెట్రోల్ బంకు నుంచి కల్లూరు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి. హైదరాబాదు, గద్వాల, అలంపూరు వైపు నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి, సంతోష్ నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా బస్టాండ్ చేరుకోవాలి. అనంతపురం, డోన్ నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు, బళ్లారి చౌరస్తా మీదుగా కొత్తబస్టాండ్‌కు చేరుకోవాలి. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత



కాంట్రిబ్యూషన్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా

కర్నూలు: పోలీసుల సంక్షేమానికి జిల్లా శాఖ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సాధారణ, పదవీ విరమణ, అనారోగ్యం, ప్రమాదంలో మృతి చెందిన పోలీసు కుటుంబాలతో మంగళవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆరు మంది హోంగార్డు కుటుంబాలకు కాంట్రిబ్యూషన్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఫ్యామిలీ బెనిఫిట్స్ జీపీఎఫ్, లీవ్ నగదు, జీఐఎస్, పెండింగ్ బిల్స్, ఏపీజీఎల్ఐ, బీమా భద్రత, పెన్షన్ తదితర బెనిఫిట్స్ అందని వారు సమస్యలను ఏఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బెనిఫిట్స్ పెండింగ్‌కు గల కారణాలను డీపీఓ పరిపాలన విభాగం సిబ్బంది ద్వారా ఏఎస్పీ అడిగి కనుక్కున్నారు. త్వరితగతిన బెనిఫిట్స్ అందేలా చూడాలన్నారు. ఏఆర్ ఏఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు భాస్కర్‌రావు, ప్రసాద్, ఏఓ విజయలక్ష్మి, ఆర్‌ఐలు జావెద్, నారాయణ, పోలీస్ సంఘం అధ్యక్షులు నాగరాజు, హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



రవీంద్రారెడ్డి దంపతులను సన్మానిస్తున్న పీఆర్ సీఈ, ఇంజినీర్లు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో 34 ఏళ్లు పనిచేసి ఆగస్టు 31న పదవీ విరమణ చేసిన క్వాలిటీ కంట్రోల్ డీఈఈ వీ.రవీంద్రారెడ్డి సన్మాన కార్యక్రమం మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈఈ ఎస్.మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చీఫ్ ఇంజినీర్ పీవీ శ్రీనివాసరెడ్డి, రిటైర్డు ఈఎన్‌సీ సుబ్బారెడ్డి, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంగీతరావు, రిటైర్డు ఎస్‌ఈలు మురళీక్రిష్ణనాయుడు, వీ.రామచంద్రారెడ్డి, కే.సుబ్రమణ్యం, కేదారీశ్వరరావు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ మురహరిరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రవీంద్రారెడ్డి సేవలను కొనియాడారు. ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామాల్లో సీసీ రోడ్లు ఆయన హయాంలో నిర్మించినవేనన్నారు. అలాగే పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు పుల్యాల నాగిరెడ్డి, ఎస్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. అనంతరం రవీంద్రారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. డీఈఈలు బండారు శ్రీనివాసులు, కర్రెన్న, మల్లికార్జున, శేషయ్య, భాస్కర్ రెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు తక్షణ వైద్యమందించాలి



క్యాజువాలిటీలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర విభాగానికి చికిత్స కోసం వచ్చే రోగులకు తక్షణ వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన మంగళవారం ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం (క్యాజువాలిటీ)ని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రోగులతో మరింత శ్రద్ధ, మర్యాదపూర్వక వైఖరితో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వైద్యాధికారులు శారద, శ్వేత, సిబ్బంది ఉన్నారు.

నర్సులు మర్యాదగా నడుచుకోవాలి

చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులతో హెడ్ నర్సులు మర్యాదగా మసలుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన మంగళవారం తన ఛాంబర్‌లో హెడ్ నర్సులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. రోగుల పట్ల ప్రవర్తన, ఔషధాల పంపిణీ, శుభ్రత, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన చర్యలపై చర్చించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జ్ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, వైద్యాధికారులు పద్మజ, కిరణ్‌కుమార్, ఏడీ మల్లేశ్వరమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేసులను ఎత్తివేయాలి

కర్నూలు(సెంట్రల్): పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన రైతులు, సీపీఐ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ నాయకులు జేసీ డాక్టర్ బి.నవ్యను ఆమె కార్యాలయంలో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ఏడబ్ల్యూ ల్యాండ్‌లోకి అక్రమంగా వెళ్లారని కొందరు రైతులపై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు పెట్టారన్నారు. వారు చెబుతున్న పొలాల్లోకి రైతులు వెళ్లలేదని, అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు.వెంటనే సీపీఐ నాయకులు, రైతులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

నిజాయితీకి మారుపేరు సంజీవయ్య

కర్నూలు(అర్బన్): దేశ, రాష్ట్ర రాజకీయాల్లో నీతి నిజాయితీలకు మారుపేరుగా స్వర్గీయ దామోదరం సంజీవయ్య పాలన సాగించారని దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలనే డిమాండ్‌పై మంగళవారం సాధన సమితి నేతలు స్థానిక శ్రీ కృష్ణదేవరాయులు, మహర్షి వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజల 40 ఏళ్ల చిరకాల కాంక్షను ప్రభుత్వం గౌరవించాలన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య, కన్వీనర్ జేవీ కృష్ణయ్య, గౌరవ సలహాదారు దామోదరం రాధాక్రిష్ణ, నాయకులు పాల్గొన్నారు.



రాయల విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న సమితి నేతలు

మహానేత.. నిను మరువం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు

కర్నూలు (టౌన్): సంక్షేమ ప్రదాత, అభివృద్ధి సారధి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి కొనియాడారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ అకాల మరణం పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేదల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచాడన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అహమ్మద్ ఆలీఖాన్ మాట్లాడుతూ.. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో రచ్చబండ కార్యక్రమానికి వెళుతూ హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మణీగాంధీ, షరీఫ్, రైల్వే ప్రసాద్, సిట్రా సత్యనారాయణమ్మ, డిప్యూటీ మేయర్ అరుణ, మునెమ్మ, శ్రీనివాసరావు, రాజేశ్వరరెడ్డి, మంగమ్మ, భారతి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): జన హృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు మూలింటి మారెప్ప, సుధాకరబాబు తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

కర్నూలు(అర్బన్): నగర శివారు పెద్దపాడు రోడ్డులోని మోడల్ స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న శ్రీ బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి నంద్యాల జిల్లా వెలుగోడు మండలం వేల్పనూరుకు చెందిన కొల్లి శివ రూ.25 వేల నగదును విరాళంగా అందించినట్లు జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రంగస్వామి మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే కమ్యూనిటీ హాల్, కురువ విద్యార్థులకు హాస్టల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

డీఎస్సీ అనుమానాలు నివృత్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌పై నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి నగేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ–బీ కేటగిరీలో 2630 ర్యాంకు మహిళా అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచిన అధికారులు.. అంతకంటే మంచి ర్యాంకు ఉన్న వారిని పిలవకపోవడంపై అనుమాలు ఉన్నాయన్నారు. ఇలా ప్రతి క్యాడర్‌లో కొంత మంది ర్యాంకర్లకు అనుమానాలు ఉన్నాయని, అధికారులు వాటిని నివృత్తి చేయాలని కోరారు.

సీఐటీయూ న్యూసిటీ కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): సీఐటీయూ న్యూసిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన న్యూసిటీ కమిటీ మహాసభల్లో పలు తీర్మానాలతోపాటు 51 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్.నరసింహులు, వై.నగేష్‌లను ఎన్నుకున్నారు. అలాగే 15 మంది ఆఫీసు బేరర్లు, 36 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కాగా, ఈ మహాసభల్లో 110 తీర్మానాలు చేశామని, వాటి సాధన కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు వెల్లడించారు.

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గడ్డ వీధి యూపీహెచ్‌సీలో మంగళవారం ఆశా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాల గురించి వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పోషకాహారం, సీజనల్ వ్యాధులు, రక్తహీనత, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉపయోగం, కిల్కారి సేవల గురించి ప్రజలకు తెలపాలన్నారు. లింగ వివక్షత నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ సాత్విక, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

5న సురవరం సంస్మరణ సభ

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి కె.సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభను ఈనెల 5న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ మీటింగ్ హాలులో ఉదయం 11 గంటలకు జరిగే సభకు జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర నాయకులు కె.రామకృష్ణ, పి.రామచంద్రయ్య తదితరులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ సభకు సీపీఐ నేతలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై మండలాల ప్రత్యేకాధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పెద్ద హరివాణంలో వరుసగా మూడేళ్లు, 2025లో మంత్రాలయం, హుస్సేనాపురంలో డయేరియా కేసులు రావడానికి కారణాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని, అందులో భాగంగా 80 మంది ప్రత్యేకాధికారులు గ్రామాలను ఆకస్మిక తనిఖీ చేస్తారన్నారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలను సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలని ఆర్డీఓలను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లోజేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కర్నూలు (టౌన్): నగరంలో చేపడుతున్న సుందరీకరణ, రోడ్ల నిర్మాణ పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన మున్సిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల, విజ్ఞాన మందిరం, బంగారు పేట, మున్సిపల్ కార్యాలయం, సుంకేసుల రోడ్డు ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్ క్యాప్ నిధులు విడుదల కానున్నాయని, అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మునగాలపాడు సర్కిల్, సంతోష్ నగర్ సర్వీస్ రోడ్డు మరమ్మతులు చేయించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ

కర్నూలు(సెంట్రల్): జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఎస్‌ఈగా నియమితులైన మనోహర్ కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రణాళికలను వివరించారు. ప్రస్తుత ఎస్‌ఈ నాగేశ్వరరావు వెంట ఉన్నారు.

మూడు రోజుల్లో 4,817 క్వింటాళ్ల ఉల్లి కొనుగోలు



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత

కర్నూలు (అగ్రికల్చర్): ఉల్లి రైతులు నష్టపోరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం క్వింటాకు రూ.1200 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తోందని మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత అన్నారు. ఆమె మంగళవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లను కమిషనర్ పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడటంతో పాటు ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు మూడు రోజుల్లో 4,817 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలోని 3,400 మెట్రిక్ టన్నుల ఉల్లిని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర గిట్టుబాటు కావడం లేదని, క్వింటా రూ.2 వేల ప్రకారం ఉల్లిని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు, డీడీ లావణ్య, ఏడీ నారాయణమూర్తి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రామాంజినేయులు, మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాతో కలసి ఉల్లి కొనుగోళ్లపై చర్చించారు.

6న మారథాన్ పరుగు

కర్నూలు(హాస్పిటల్): ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం ఈ నెల 6న జిల్లా స్థాయి మారథాన్ (5 కి.మీ) పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. ఈ మేరకు అవగాహన పోస్టర్లను మంగళవారం ఆయన ఛాంబర్‌లో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం, జిల్లా క్రీడా శాఖ సంయుక్తంగా మారథాన్ పరుగు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 6 గంటలకు కోల్స్ కళాశాల నుంచి పార్కు రోడ్, రాజవిహార్, కర్నూలు మెడికల్ కాలేజీ, సి.క్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వరకు పరుగు ఉంటుందన్నారు. 17 – 25 ఏళ్ల వయస్సు గల జిల్లా వాసులు పాల్గొనవచ్చన్నారు. జిల్లా క్రీడాశాఖ అధికారి భూపతిరావు, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్ మాట్లాడారు. మారథాన్ విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.7 వేలు నగదు బహుమతులు అందిస్తామని, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వెల్లడించారు.